

పోలీస్ కవాతు

నగరంపాలెం: గుంటూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం కవాతు నిర్వహించారు. జిల్లా కోర్టు సర్కిల్ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పులిచింతలకు వరద

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు శనివారం 1,18,890 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. 1,20,577 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

వైభవంగా వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర జిమ్నాస్టిక్స్ ఓవరాల్ చాంపియన్‌గా గుంటూరు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్స్ అండర్- 14, 17 బాలబాలిక చాంపియన్‌షిప్-2024ను గుంటూరు జిల్లా కైవసం చేసుకుంది. మూడు రోజుల నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న పోటీలు శనివారంతో ముగిశాయి. ద్వితీయ, తృతీయ స్థానాలలో తూర్పు గోదావరి, కడప జిల్లాలు నిలిచాయి. విజేతలకు డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, సక్కు గ్రూప్ అధినేత మాధవి, రాయపాటి మమత తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ పోటీలకు ఎంతో మంది సహకారం అందించారన్నారు. పోటీల నిర్వహణ భవిష్యత్తుకు ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ అఫ్రోజ్, డాక్టర్ కంచర్ల రామ్‌ప్రసాద్, శిరీష, జి.రాజేష్, కార్పొరేటర్ మీరావలి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి




నగరంపాలెం: రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరు తెన్నులపై శనివారం గుంటూరు నగరంలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంపాలెం పరిధిలోని స్టాల్ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం ప్రైమరీ, ఉన్నత పాఠశాల, కేవీపీ కాలనీలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, చుట్టుగుంటలోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. పిల్లలతోనూ మాట్లాడారు. సక్రమంగా ఆహారం, నీరు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఏవైనా లోపాలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తేవాలని చెప్పారు.

నకిలీ నిందితుడి పట్టివేత

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా కోర్టులోని ఎస్సీ, ఎస్టీ 4వ అదనపు కోర్టులో నకిలీ నిందితుడు విచారణకు హాజరు కావడంతో సంబంధిత కోర్టు న్యాయమూర్తి పట్టుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత కోర్టు పరిపాలనా అధికారి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ కేసులో ఏ9 గా ఉన్న జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి శనివారం కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. ఆయన స్థానంలో సునీల్ అనే వ్యక్తి హాజరు అవుతున్నట్లు గత రెండు రోజుల క్రితమే కోర్టుకు మానవ హక్కుల పోరాట సమితి నుంచి ముందుగా లేఖ వచ్చింది. శనివారం సునీల్ వచ్చాడు. న్యాయమూర్తి అతడిని పట్టుకుని ఐడీ కార్డులను, ఆధార్ కార్డులు, సంతకాలను పరిశీలించారు. అతడితోపాటు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఆ మేరకు కోర్టు పరిపాలనాధికారి శివ సుబ్రహ్మణ్యం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సునీల్‌ని పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

హుండీ కానుకల లెక్కింపు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. పెదకాకాని శివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి గుంటూరు శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానం ఈవో ఎస్ఎల్‌టీ సౌమ్య పర్యవేక్షణాధికారిణిగా విచ్చేశారు. 90 రోజులకుగాను రూ.40,49,823 నగదు ఆదాయం చేకూరింది. 24.700 మిల్లీ గ్రాములు బంగారం, 432 గ్రాములు వెండి , విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు కూడా లభించినట్లు ఆలయ డీసీ తెలిపారు. అన్నప్రసాద హుండీ ద్వారా రూ.54,658 ఆదాయం చేకూరిందని వివరించారు.

అధ్వాన భోజనం!

నాడు 'గోరు ముద్ద'..
నేడు 'ముద్ద ముద్ద'

"ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పెట్టాల్సిన మధ్యాహ్న భోజనం అధ్వానంగా మారింది. కోడిగుడ్డు కూడా మాయమైంది. దసరా సెలవుల అనంతరం ఈ నెల 14వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. ఆ తరువాత కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాలలతోపాటు జిల్లా వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఈ సమస్య నెలకొంది."



ఏటీ అగ్రహారంలో హైస్కూల్లో భోజనం వడ్డన

- స్కూళ్లలో దిగజారిన మధ్యాహ్న భోజన పథకం అమలు
- ముక్కిపోయిన బియ్యంతోనే అన్నం వండుతున్న సిబ్బంది
- కోడిగుడ్డు లేకుండానే విద్యార్థులకు వడ్డిస్తున్న దుస్థితి
- కూటమి ప్రభుత్వం వచ్చాక అర్ధాకలితో బాలలు విలవిల

గుంటూరు ఎడ్యుకేషన్ : పొద్దున లేస్తే ఊకదంపుడు మాటలు చెప్పే కూటమి పాలకులు ఇప్పుడు బాలల కడుపు నింపే మధ్యాహ్న భోజన పథకాన్నికూడా గాలికి వదిలేశారు. కోడిగుడ్డు లేకుండానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్నారు. వైఎస్సీపీ ప్రభుత్వంలో విద్యార్థుల సంతృప్తే ధ్యేయంగా అమలుపరిచిన జగనన్న గోరు ముద్ద గత వైభవానికి సాక్ష్యంగా మారింది. అప్పట్లో వారంలో ఆరు రోజులపాటు ఆకర్షణీయమైన మెనూతో అందించిన రుచికరమైన భోజనంతో సంతృప్తిగా విందు ఆరగించిన విద్యార్థులు.. నూతన ప్రభుత్వం వచ్చాక అర్ధాకలితో నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన జగనన్న గోరు ముద్దను దాదాపు 80 శాతానికిపైగా విద్యార్థులు ఆరగించేవారు. వారి కడుపు నింపేందుకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో పథకం పకడ్బందీగా అమలు జరిగింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా రూపకల్పన చేసిన మెనూను యథావిధిగా అమలు చేశారు. ఇందులో భాగంగా మండల, జిల్లా స్థాయి అధికారులతోపాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పథకం అమల్లో నాణ్యతాప్రమాణాలకు పెద్దపీట వేశారు.

కూటమి వచ్చాక అంతే సంగతులు

కానీ కూటమి సర్కారు వచ్చాక పరిస్థితి మారింది. పాఠశాలలు తెరిచిన తరువాత మధ్యాహ్న భోజనం అమలుపై ప్రభుత్వం దృష్టి సారించిన పాపాన పోలేదు. విద్యార్థులకు కోడిగుడ్డు అందడం లేదు. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో అందిస్తున్న ఆహార పదార్థాలు రుచించక, విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. కోడిగుడ్ల సరఫరాదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సమస్య ఉత్పన్నమైందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.



నాణ్యత లోపించిన ఆహార పదార్థాలు



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న బాలలు

ముక్కిపోయిన బియ్యమే దిక్కు

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ముక్కిపోయిన బియ్యంతో అన్నం వండుతున్నారు. ముద్ద ముద్దగా మారి వాసన వస్తున్న ఆ అన్నాన్ని తినేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు. దీంతో పాటు ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తెచ్చుకుని, మిగిలిన విద్యార్థులతోపాటు ఆరగిస్తున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,063 ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల పరిధిలో 95,758 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 69,911 మంది విద్యార్థులు రోజూ మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్నారు. కేవలం 73 శాతం మందే భోజనం తింటుండగా, మిగిలిన వారు ఆహార పదార్థాలు రుచించక ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు.



కోడిగుడ్లు అందేలా చర్యలు

ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్లకు కోడిగుడ్లు సక్రమంగా సరఫరా కాని సంఘటనలపై సరఫరాదారుల నుంచి వివరణ కోరతాం. ఇండెంట్‌కు అనుగుణంగా కోడిగుడ్లు సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు యథావిధిగా సరఫరా జరిగేలా పర్యవేక్షిస్తాం. అలా అందని పక్షంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలి.

- పి. శైలజ, డీఈవో, గుంటూరు

హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు చేయండి



సదస్సులో మాట్లాడుతున్న విజయభారతి

గుంటూరు ఎడ్యుకేషన్ : మానవ హక్కులకు భంగం వాటిల్లిన పక్షంలో తమకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ ఎస్.విజయభారతి అన్నారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో థింక్ భారత్ ఆధ్వర్యంలో ప్రీ లోకమంతన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి – కళలు – అధ్యయనం అంశాలపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా విజయభారతి మాట్లాడుతూ.. బాధితులు తమ ఫిర్యాదును ఆన్‌లైన్‌లోనూ పంపవచ్చునని పేర్కొన్నారు. దాదాపు 60 వర్గాల వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వివరించారు. తన పర్యటనలో భాగంగా 14 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. 2023-24 సెప్టెంబర్ వరకు 68,223 అర్జీలు వచ్చాయని, 68 వేల కేసులు డిస్పోజ్ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కొండపల్లి బొమ్మలు, హస్తకళలతో కూడిన స్టాళ్లను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బులుసు శివశంకర్‌రావు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిలు ప్రారంభించారు. ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న నరసరావుపేటకు చెందిన దుర్గారావు తోలుబొమ్మలాట బృందాన్ని, కొల్లిపర మండలం అత్తోటకి చెందిన కనక ప్రసాద్ చెక్క భజన బృందాన్ని సత్కరించి, పారితోషికం అందించారు. ప్రముఖ విశ్లేషకులు మామిడి గిరిధర్, ప్రముఖ కవి డాక్టర్ భాస్కర యోగి, వీ కళాశాల కరస్పాండెంట్ జూపూడి రంగరాజు, థింక్ భారత్ కన్వీనర్ డీఎస్సార్ మూర్తి, డాక్టర్ కేవీజీఎస్ మూర్తి, హిందూ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ బాధ్యత సర్కారుదే

రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల పరిరక్షణతోపాటు వాటిని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని విజయభారతి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ ఇన్‌టాక్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల అవగాహన శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌టాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ నారాయణ, ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

డ్రగ్స్.. డేంజర్ బెల్స్

- ప్రైవేటు ట్రావెల్స్‌లో యథేచ్ఛగా అక్రమ దందా
- వేడుకల మాటున విచ్చలవిడిగా వాడకానికి స్కెచ్
- కొందరి అత్యాశకు బలవుతున్న ఎందరో యువత

సాక్షిప్రతినిధి, గుంటూరు: పోలీసులకు శుక్రవారం పట్టుబడిన గుంటూరుకు చెందిన డొనాల్డ్, యూసఫ్ షరీఫ్‌ల నేపథ్యం జిల్లా పోలీసులను షాక్‌కు గురిచేసింది. డొనాల్డ్ తన టీంతో కలిసి ఈ దందా చాలా రోజులుగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. హోలీ పండుగ సందర్భంగా గుంటూరులో పెద్ద ఈవెంట్ నిర్వహించాడు. తాజాగా దసరా సందర్భంగా నల్లపాడు స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో దాండియా ఈవెంట్‌కు దరఖాస్తు చేశాడు. దీనికి నల్లపాడు పోలీసులు అనుమతి కూడా ఇచ్చారు. తర్వాత కొన్ని సంఘాల వారు దీనిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీని కలవడంతో అనుమతులు రద్దు చేశారు. ఈవెంట్ జరిగి ఉంటే అందులో డ్రగ్స్ విచ్చలవిడిగా వినియోగించేవారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శుక్రవారం అరెస్టు చేసినప్పుడు వీరి నుంచి భారీగా ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి ఎల్ఈడీ ల్యాంప్‌లో డ్రగ్స్ దాచి గుంటూరుకు తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రావెల్స్ వద్ద పార్సిల్ తీసుకునేందుకు వచ్చిన సమయంలో పోలీసులు రైడ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. దాదాపు రూ.ఐదు లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి ల్యాప్‌టాప్ కూడా స్వాధీన పరుచుకున్నారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు... ఎవరికి విక్రయిస్తున్నారనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు.



దాండియా ఈవెంట్ కోసం వేసిన పోస్టర్

ఇవిగో నిదర్శనాలు

- మూడు నెలల క్రితం నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో చల్లా గోపి అనే వ్యక్తి కోర్టులో లొంగిపోయాడు. వారి నుంచి పది గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.
- తర్వాత పట్టాభిపురం, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కూడా ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.
- కొద్ది రోజుల క్రితం గుంటూరుకు చెందిన మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు కొడుకు మస్తాన్ సాయిని డ్రగ్స్ కేసులో నార్కొటిక్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- గుంటూరులో ఫేమస్ హోటల్ యజమాని కొడుకును కూడా డ్రగ్స్ కేసులో అదుపులోకి తీసుకుని 30 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా వీళ్లు డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడ్డారు. మస్తాన్ సాయి కూడా పలుసార్లు జైలుకు కూడా వెళ్లొచ్చాడు.
- నెల క్రితం గుంటూరుకు చెందిన అంకాల విజయ్, రోషన్‌లు హైదరాబాద్ నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి గుంటూరులో విక్రయించేందుకు తీసుకొచ్చారనే సమాచారంతో సెబ్ అధికారులు దాడులు చేశారు. వీరి నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

మంగళగిరి ప్రాంతంలో ఎక్కువ..

ఎక్కువగా మంగళగిరి ప్రాంతంలోని ప్రైవేట్ యూనివర్సిటీతోపాటు గుంటూరు చుట్టుపక్కల ఉన్న మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్ పెడ్లర్స్ చెలరేగిపోతున్నారు. సంపన్నవర్గాల విద్యార్థులు, యువతను బానిసలుగా మార్చి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. అందుకు రావి మస్తాన్‌సాయి సెల్‌ఫోన్‌లో లభించిన యువతులు, మహిళల వీడియోలే నిదర్శనం. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఇటీవల ఓ కేసు విషయమై మాట్లాడినప్పుడు డ్రగ్స్ వాడుతున్న వారిని, వారి తల్లితండ్రులను కూడా పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తీరు మారకుంటే వారిపైనా కేసులు పెడతామని హెచ్చరించారు. అయినా డ్రగ్స్ డేంజర్ బెల్స్ మోగుతూనే ఉన్నాయు. వినియోగం ఆగడం లేదని ఈ ఘటనలతో తెలుస్తోంది.

ఎట్టకేలకు రోడ్లకు మరమ్మతులు

- 178 కి.మీ. మేర పనులకు రూ.10.60 కోట్లు
- వచ్చే వారంలో టెండర్లు, నవంబరులో మొదలు కానున్న పనులు

గుంటూరు వెస్ట్ : ఈ ఏడాది ఆగస్ట్ చివరిలో, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో పాటు కృష్ణా నది వరద కారణంగా జిల్లాలో పలు రోడ్లు దెబ్బతిన్నాయి. దీనిపై రోడ్లు, భవనాల శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. జాతీయ రహదారులకు సంబంధించి మొత్తం 70 కి.మీ.కిగానూ రూ.4.08 కోట్లు, జిల్లా ప్రధాన రహదారులు (ఎండీఆర్)కు సంబంధించి 108 కి.మీ.కిగానూ రూ.6.52 కోట్లు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కృష్ణా నదికి ఆనుకుని గుంటూరు జిల్లాకు సంబంధించి ప్రధాన రహదారులు దారుణంగా దెబ్బతినడంతో రాకపోకల అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో కొన్ని గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో అధికారులు కదిలారు. ఈ రోడ్లకు సంబంధించి వచ్చే వారం టెండరు ప్రక్రియ పూర్తి చేసి నవంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి అయింది. వచ్చే నెల చివరికల్లా మరమ్మతులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసి, ఆ తర్వాత పూర్తి స్థాయిలో నిర్మించనున్నట్లు తెలిపారు.



దుగ్గిరాల-కొల్లిపర రోడ్ దుస్థితి

త్వరగా పూర్తి చేస్తాం



వరదలు, అకాల వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న జాతీయ రహదారుల్లో 7 పనులు, జిల్లా ప్రధాన రహదారుల్లో 24 పనులకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారం నిధులు మంజూరయ్యాయి. వీటిని నవంబర్ తొలి వారంలోనే ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. ఆ తర్వాత పూర్తి స్థాయి రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారిస్తాం. పనులకు సంబంధించి ఆర్థిక ఇబ్బందులు లేవు.

- విశ్వనాథ రెడ్డి, ఈఈ, రోడ్లు - భవనాల శాఖ, గుంటూరు జిల్లా

బాణసంచా ప్రమాదాల నివారణ ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గుంటూరు వెస్ట్: ఈ నెల 31వ తేదీన దీపావళిని పురస్కరించుకుని ప్రజలు ఉపయోగించే బాణసంచా సామగ్రితో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. దీపావళి దుకాణాల అనుమతుల కోసం సంబంధిత శాఖల అధికారులు బాణసంచా విక్రయించే హోల్‌సేలర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. దుకాణాల కోసం ఈ నెల 26వ తేదీలోపు సింగిల్ విండో విధానంలో దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణమొద్దు బాబూ...!



ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించబోమని పాత గుంటూరు మణి హోటల్ సెంటర్ వాసులు స్పష్టం చేశారు. శనివారం దీనిపై నిరసన చేపట్టారు. ఇక్కడ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, పాఠశాల ఉన్నందున మద్యం దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. మహిళలు, బాలికలకు రక్షణ ఎవరు కల్పిస్తారని సర్కార్‌ను నిలదీశారు. - పట్నంబజారు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,300** గరిష్ఠం : రూ. **5,700**

మోడల్ ధర రూ. **5,000**

క్లుప్తంగా

కానిస్టేబుల్‌పై కేసు

లక్ష్మీపురం: పట్టాభిపురం స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ దారి తప్పాడు. ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే కాకుండా ఆమె భర్తను హతమార్చుతానని బెదిరించాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌పై శనివారం కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. వారి ఇంటి సమీపంలోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే యెలిశెల్ల కిరణ్ నివాసం ఉంటున్నాడు. సెప్టెంబర్ 23వ తేదీన తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నందుకు కిరణ్‌ను బాధితుడు నిలదీశారు. దీంతో విచక్షణరహితంగా కొట్టి, అంతు చూస్తానని కానిస్టేబుల్ బెదిరించాడు. బంధువులకు జరిగిన విషయం చెప్పి వారి సహాయంతో నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

మంగళగిరిలో 36.8 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు: గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం – శనివారం ఉదయం వరకు అత్యధికంగా మంగళగిరి మండలంలో 36.8 , అత్యల్పంగా గుంటూరుతూర్పులో 1.2 మి.మీ. వాన పడింది. సగటున 11.4 మి.మీ.గా నమోదైంది. దుగ్గిరాల మండలంలో 29.8, ఫిరంగిపురం 28, ప్రత్తిపాడు 18.8, తాడికొండ 17.2, వట్టిచెరుకూరు 13.4, కాకుమాను 12.4, పెదకాకాని 11.6, పెదనందిపాడు 6.8, కొల్లిపర 6.4, తెనాలి 5.8, గుంటూరు పశ్చిమ 4.2, తాడేపల్లి 3.2, మేడికొండూరు 3.6, తుళ్లూరు 2.2, పొన్నూరు 1.6, చేబ్రోలు మండలంలో 1.4 మి.మీ. చొప్పున పడింది.

ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇస్తున్నాడని దాడి

– టీడీపీ, జనసేన నాయకుల అండతో రెచ్చిపోతున్న రౌడీషీటర్ హరి

మంగళగిరి: ఇసుక అక్రమ రవాణా వ్యవహారం రౌడీషీటర్ల మధ్య గొడవకు దారి తీసింది. మండలంలోని యర్రబాలెంకు చెందిన సురేష్ ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం ఇస్తున్నాడనే కారణంతో శనివారం తాడేపల్లికి చెందిన రౌడీషీటర్ హరికృష్ణ తన అనుచరుడు రామకృష్ణతో కలిసి దాడి చేశాడు. కొంతకాలంగా తాడేపల్లి మండలం గుండిమెడ, ప్రాతూరు, చిర్రావూరు ఇసుక క్వారీల నుంచి హరికృష్ణ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. సురేష్‌పై దాడి ఘటనను వీడియో తీసిన యువకులు కొందరు జిల్లా ఎస్పీకి దానిని చేరవేశారు. ఎస్పీ ఆదేశాలతో హరికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరి గతంలో రాజధాని ప్రాంతంలో ఇసుక, మట్టి, ఇనుము దొంగతనం చేయగా పోలీసులు అరెస్ట్ చేశారు. తాడేపల్లిలో దారి దోపిడీలు, ఇసుక, మట్టి, అక్రమ మద్యం వ్యాపారాలతో స్థానికులను ఇబ్బంది పెడుతున్నాడు. తనకు టీడీపీ, జనసేన నాయకుల అండ ఉందని హరికృష్ణ పేర్కొంటూ, తనను ఎవరూ ఏమీ చేయరని సవాల్ విసురుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. హరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అండర్-14, 17 జిల్లా చదరంగ జట్లు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 14, 17 చదరంగం జిల్లా జట్లకు క్రీడాకారులు ఎంపికయ్యారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జట్ల ఎంపిక ప్రక్రియ అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వివరాలను శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాసిం మాట్లాడుతూ చెస్ ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 340 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్–17 జట్లు ఇవే..

బాలుర విభాగం: అర్జున్ ఆదిత్య, పీఎస్వీ యశ్వంత్ రాజ్ కుమార్ (గుంటూరు), ఎ. చంద్రమహేష్, ఐ. మెహిత్ వెంకటశ్రీసాయి, ఆర్. భార్గవ్ శ్రీనివాస నాయక్ (మాచర్ల).



క్రీడాకారులతో షేక్ ఖాసిం, వ్యాయామ ఉపాధ్యాయులు

బాలికల విభాగం: ఎ. సాయిదివ్య (గుంటూరు), ఎం. నాగసరియా (అమరావతి), పి. దివ్య (కొలకలూరు), షేక్ నజీరా (ఆత్మకూరు), ఎం. మైథిలి (అమరావతి).

అండర్–14 జట్లు ఇవే..

బాలుర విభాగం: కె. శాన్వి మౌజీ (మాచర్ల), ఏహెచ్ సూర్యనారాయణ, బి. ప్రజిత్, వై. యాజ్ఞస్ (గుంటూరు), ఆర్. లోకేష్ (పిడుగురాళ్ల).

బాలికల విభాగం: ఎం. తేజ అనూష, బి. భావన, మిరియాల సీహెచ్ లక్ష్మీ చేతన, ఎం. మనస్విని (గుంటూరు), సీహెచ్ మేరీ అక్షయ (తెనాలి).

పతకాలు సాధించిన విద్యార్థినికి అభినందన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థిని షేక్ సాదియా కామన్‌వెల్త్ పవర్‌ఫిల్టింగ్ పోటీల్లో సత్తా చాటింది. ఏకంగా నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.


షేక్ సాదియాను అభినందిస్తున్న వీసీ

వరద బాధితులకు అప్సా రూ.64 లక్షల విరాళం

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) తరఫున సీఎం సహాయ నిధికి రూ.64,02,854లను అందజేసినట్లు అప్సా కో చైర్మన్ మేకల రవీంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబును శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి ఈ మొత్తం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, అప్సా కౌన్సిల్ చైర్మన్ కొమరగిరి చంద్రశేఖర్, ప్రతినిధులు మెట్ల జనార్దన్‌రావు, భాస్కరరావు, అప్పలనాయుడు, సింహాచలం పాల్గొన్నారని పేర్కొన్నారు.


సీఎంకు నమూనా డీడీ అందజేస్తున్న నేతలు

కొమ్మమూరు కాల్వలో బీటెక్ విద్యార్థి గల్లంతు

తెనాలి రూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని కొమ్మమూరు కాల్వలో గుంటూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతైన సంఘటన శనివారం జరిగింది. విద్యార్థి బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు లాం లోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న రవీంద్ర (20) తన ఐదుగురు స్నేహితులతో కలిసి శనివారం ఉదయం సంగంజాగర్లమూడి వచ్చాడు. సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం గుడి ఎదురుగా ఉన్న కాల్వలో ఈతకు దిగారు. ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉండటంతో రవీంద్ర గల్లంతయ్యాడు. మిగిలిన వారు అతడి కుటుంబ సభ్యులకు, తెనాలి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం తెనాలి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించే ప్రయత్నం చేశారు. రవీంద్ర గల్లంతైన ప్రదేశంతోపాటు జాగర్లమూడి లాకుల వద్ద కూడా గాలింపు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. సాయంత్రం పొద్దుపోయే వరకూ గాలింపు జరిపినా ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో సంగంజాగర్లమూడి చేరుకున్నారు. రవీంద్రకు తండ్రి లేడని, తల్లి గుంటూరు నగరపాలక సంస్థలో స్వీపర్‌గా పని చేస్తున్నారని తెలిసింది. రవీంద్ర సోదరుడు ఇంజినీరింగ్ చదువుతున్నట్లు బంధువులు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్. ప్రతాప్ తెలిపారు.


గాలింపు చేపట్టిన ప్రాంతం

ఓవరాల్ చాంపియన్‌షిప్ తమిళనాడు కైవసం



బాలికలు, బాలుర విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న తమిళనాడు బృందాలు

ఏఎన్‌యూ: సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను తమిళనాడు అథ్లెట్ల బృందం సొంతం చేసుకుంది. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఆ రాష్ట్ర అథ్లెట్లు అగ్రస్థానంలో నిలిచారు. ఓవరాల్ కేటగిరీలో కర్నాటక బృందం రెండు, కేరళ మూడో స్థానంలో నిలిచింది. బాలురు, బాలికల కేటగిరీలలో చాంపియన్‌షిప్‌లను తమిళనాడు అథ్లెట్ల బృందాలే సొంతం చేసుకున్నాయి. వ్యక్తిగత కేటగిరీలో అండర్ – 14 బాలుర విభాగంలో రాథోడ్ కార్తీక్ (తెలంగాణ), బాలుర అండర్–16 విభాగంలో ఆయూష్ ప్రన్షల్ (కర్నాటక), బాలుర అండర్ – 18 విభాగంలో దయానంద్ దుంపాన్నవార్ (కర్నాటక), పురుషుల అండర్–20 విభాగంలో షేక్ రోషన్ (ఆంధ్రప్రదేశ్)లు చాంపియన్‌షిప్ సొంతం చేసుకున్నారు. అండర్ 14- బాలికల విభాగంలో ఆర్తి ఎస్‌కే (తమిళనాడు), బాలికల అండర్–16 విభాగంలో డింపుల్ మహా శ్రీ లక్కోజు (ఆంధ్రప్రదేశ్), బాలికల అండర్–18 విభాగంలో స్తుతి శెట్టి (కర్నాటక), మహిళల అండర్ – 20 విభాగంలో శ్రీ వర్తని ఎస్‌కే (తమిళనాడు) వ్యక్తిగత చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఏ హైమావతి, జాయింట్ సెక్రటరీ ఎ.వి. రాఘవేంద్రరావు, టెక్నికల్ అఫీషియల్ శ్రీనివాసరావు, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్, అధ్యక్షుడు కె. మధుసూదనరావు, మాజీ ఇంటర్నేషనల్ అథ్లెట్ ఎస్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. పోటీల్లో మూడోరోజైన శనివారం పలు అంశాల్లో జూనియర్ అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్షంలో కూడా విజయమే లక్ష్యంగా పోటీల్లో ప్రతిభ కనబరిచారు.


హర్డిల్స్ దూకుతున్న బాలురు